క్లుప్తంగా

ఎస్‌పీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కార్తీక్

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌పీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. అధ్యక్ష పదవికి హరినాథ్ బాబ్జీ, కార్తీక్‌లు పోటీపడ్డారు. మొత్తం కాలనీలో 215 ఓట్లు ఉండగా, 132 ఓట్లు పోలయ్యాయి. హరినాథ్ బాబ్జీకి 59 ఓట్లు, కార్తీక్‌కు 73 ఓట్లు పోలయ్యాయి. 14 ఓట్ల మెజార్టీతో కార్తీక్ గెలుపొందారు. ఎన్నికల అధికారిగా పి. రఘుపతి రెడ్డి వ్యవహరించారు. మిగతా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పి. లక్ష్మీ వినోద, కోశాధికారిగా రాములు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా పి. కృష్ణారావు, టి. రామేశ్వర్ రెడ్డి, డి. సూర్యనారాయన్, డి. వసంత, కెవికె చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

బాలిక అదృశ్యం

బాలానగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ టి. నరసింహరాజు వివరాల ప్రకారం.. గౌతమ్ నగర్‌కు చెందిన కొడవత్ లక్ష్మణ్ చిన్న కుమార్తె (15) బయటకు వెళుతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ బాలానగర్ డివిజన్ అధ్యక్షుడిగా కిరణ్



బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌తో బీజేపీ నాయకులు

బాలానగర్: బీజేపీ బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు జి.ఆర్. రమేష్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రాజేంద్ర ప్రసాద్‌ను బుధవారం సీనియర్ నాయకుల సమక్షంలో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సురేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తూరు రమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వెంకట సేనా రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు శివరంజని, మోర్చా అధ్యక్షుడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ఫిబ్రవరి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ కల్పన బుధవారం తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం, అలాగే 6 నుంచి 9వ తరగతిలో ఏర్పడిన ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను కోరుతున్నామన్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 23వ తేదీ జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు కోసం కులధ్రువీకరణపత్రం, ఆదాయ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు నంబర్ (జిరాక్స్ ప్రతి), బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు.

బీజేపీకి కొత్త సారథులు

- పూర్తయిన బూత్, మండల కమిటీలు
- పార్టీ కార్యకలాపాలకు అనుగుణంగా ఐదు అసెంబ్లీ స్థానాలు రెండు జిల్లా కమిటీలుగా విభజన
- అర్బన్, రూరల్ జిల్లా కమిటీల అధ్యక్ష స్థానాలకు పోటాపోటీ
- ఈ నెల 20 లోగా అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్న అధిష్టానం



పటోళ్ల విక్రంరెడ్డి



తిరుమల్‌రెడ్డి



శ్రీనివాస పటేల్





మాధవరం కాంతారావు



నందనం దివాకర్



భానుప్రకాష్

సాక్షి, సిటీబ్యూరో: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి కొత్త రథసారథులు రానున్నారు. ఈ నెల 20 కల్లా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని రూరల్, అర్బన్ బీజేపీ జిల్లా అధ్యక్షులను అధికారికంగా ప్రకటించేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత బీజేపీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించింది. సభ్యత్వ నమోదు మొదలు.. బూత్ కమిటీలు, మండల కమిటీలపై కొంత కాలంగా కసరత్తు చేపట్టింది. ముఖ్య కార్యకర్తలు, కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవటం ద్వారా వాటిని పూర్తి చేసింది. శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం తర్వాత ఇందులోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి భారతీయ జనతా పార్టీ ఒక జిల్లా కమిటీని కొనసాగించింది. అప్పట్లో అధ్యక్షుడిగా బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత పార్టీ కార్యక్రమాల విస్తరణ తదితర కారణాల నేపథ్యంలో జిల్లా కమిటీని ప్రస్తుతం రూరల్, అర్బన్ జిల్లా కమిటీలుగా ఏర్పాటు చేశారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు 13 పురపాలక సంఘాలు, 62 గ్రామ పంచాయతీలను కలుపుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రూరల్ జిల్లా కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా అధ్యక్షుడిగా పటోళ్ల విక్రంరెడ్డి కొనసాగుతున్నారు. కూకట్‌పల్లి, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ మేడ్చల్ అర్బన్ జిల్లాను ఏర్పాటు చేయగా.. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా హరీష్‌రెడ్డిని నియమించారు. అతను పార్లమెంట్ ఎన్నికల ముందు అర్బన్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయటంతో బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డికి అర్బన్ జిల్లా ఇన్‌చార్జిగా పార్టీ అధిష్టానం బాధ్యతలను అప్పగించింది.

సెగ్మెంట్ల విభజనపై పార్టీలో తర్జన భర్జన

దేశంలోని అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో బీజేపీ కైవసం చేసుకుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీని ప్రస్తుతం ఉన్నట్లుగానే కొనసాగించాలా.. లేక రెండు లేదా మూడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ.. జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలా? అనే విషయంపై పార్టీ నాయకుల్లో తర్జన భర్జన జరుగుతోంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న రెండు జిల్లా కమిటీలలో మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ రూరల్ జిల్లా కమిటీ, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ అర్బన్ జిల్లా కమిటీగా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంపై నాయకులతో పాటు కేడర్‌లో వాడీవేడి చర్చ సాగుతోంది.

- అలాగే ఉప్పల్, మల్కాజిగిరి, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుతూ అర్బన్ జిల్లా కమిటీగా, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ రూరల్ జిల్లా కమిటీగా ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాలు కూడా నేతల్లో వ్యక్తమవుతోంది. పార్టీ అధిష్టానం ముందు జిల్లా నాయకులు అర్బన్, రూరల్ జిల్లా కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలు పెట్టారు. తుది నిర్ణయంతో కొత్త జిల్లా రథసారథులను త్వరలో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అధిష్టానం బూత్, మండల కమిటీలతో సహా ముఖ్య నేతల నుంచి కొత్త రథసారథుల నియామకంపై అభిప్రాయాలను సేకరించటం ద్వారా నేతల పేర్లను కూడా ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

అధ్యక్ష పదవులపై పోటాపోటీ

భారతీయ జనతాపార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అర్బన్, రూరల్ కమిటీలకు కొత్త రథ సారథులను త్వరలో నియమించనుండటంతో ఆసక్తి కనబరిచే నేతల్లో పోటీ కూడా తీవ్రంగా ఉంది. మేడ్చల్ రూరల్ జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి 11 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డితో సహా జిల్లా నాయకులు జిల్లాల తిరుమల్‌రెడ్డి, బుద్ధి శ్రీనివాసపటేల్, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, శోభారెడ్డి, కూరపాటి విజయకుమార్ పోటీ పడుతున్నారు. పటోళ్ల విక్రంరెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగలేనని పేర్కొంటే తప్ప.. ఇతరులకు ఆ పదవిని కట్టబెట్టవచ్చునన్న చర్చ పార్టీ వర్గాల్లో కొనసాగుతోంది. అలాగే అర్బన్ జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి నందనం దివాకర్, భానుప్రకాష్, డాక్టర్ శిల్పారెడ్డి, అడ్వకేట్ ప్రసన్న , శ్రీనివాస్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం తర్వాత ప్రథమంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పడిన బీజేపీ జిల్లా కమిటీకి అధ్యక్షుడిగా పని చేసిన కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావును కూడా పార్టీ అధిష్టాన వర్గం నియమించవచ్చుననే ప్రచారం కూడా జరుగుతోంది.

వినియోగదారులను ప్రోత్సహించేందుకు బంపర్ డ్రా

మూసాపేట: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తమ కస్టమర్లను ప్రోత్సహించడం కోసం తలపెట్టిన 25 గ్రాముల సిల్వర్ కాయిన్ డ్రా కార్యక్రమాన్ని మూసాపేట హెచ్‌పీ రోడ్డులోని ఐఓసీఎల్ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎల్‌పీజీ హెడ్ సితేష్ కిషన్ ఆధ్వర్యంలో అవగాహన, డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఓసీఎల్ టప్సో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జీఎం యోగారాణి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తమ ఇండియన్ డీలర్ల ద్వారా కొనుగోలు చేసిన కస్టమర్లను ప్రోత్సహించేందుకు 25 గ్రాముల వెండి నాణెం అందించే సంకల్పంతో దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా బంపర్ డ్రా నిర్వహించి ఎంపికైన వారికి వెండి నాణెం అందించామన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఇండేన్ డివిజన్ సిబ్బంది కీర్తి, సోనా సాహూ, సుబ్బారావు పాల్గొన్నారు.

పండుగపూట హౌస్ అరెస్టు దారుణం



మాజీ కార్పొరేటర్ రంగారావును తీసుకెళ్తున్న పోలీస్

ఆల్విన్‌కాలనీ: సంక్రాంతి పండుగ రోజు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావును పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసినందుకు ఎక్కడ ధర్నాలు చేపడతారో అనే భయంతో ప్రభుత్వం సంక్రాంతి పండుగ రోజు హౌస్ అరెస్టులు చేయించటం సరికాదన్నారు. ప్రశ్నిస్తున్నందుకే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా పాలన కాదని, ముమ్మాటికి పోలీసుల పాలన అని ఎద్దేవా చేశారు.

మేరు కేశవులు సేవలు మరువలేం



చిత్రపటం వద్ద పూలమాలేసి నివాళి అర్పిస్తున్న జావెద్ అలీ తదితరులు

మోతీనగర్: తెలంగాణ సాయుధ పోరాటంలో దివంగత మాజీ మంత్రి మేరు కేశవులు పాత్ర ఎనలేనిదని టీపీసీసీ మాజీ ఆర్గనైజర్ సెక్రటరీ ఎస్.కే. జావిద్ అలీ అన్నారు. బుధవారం మేరు కేశవులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంతో పాటు సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని స్మరించుకున్నారు.



పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం మైస గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు - కూకట్‌పల్లి

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, మహేష్ గౌడ్

కూకట్‌పల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాజుల మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కేలండర్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం బుధవారం ఆవిష్కరించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, తూము వేణు, ఏ, బీ బ్లాక్ మహిళా అధ్యక్షురాళ్లు రమాదేవి, సంధ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు జ్యోతి, డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, తమ్మినేని ప్రవీణ్, మల్లికార్జున్ యాదవ్, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు జోజమ్మ, మారుతి, కృష్ణవేణి, భారతమ్మ, జ్యోతి, బండి సుధ, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుల్‌మొహర్‌పార్కును సందర్శించిన ఎమ్మెల్యే గాంధీ



గుల్‌మొహర్‌పార్కులో ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్ మొహర్ కాలనీ పార్కును ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సందర్శించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పార్కుకు వచ్చారు. మనవడు ఆర్యవీర్, మనవరాలు అన్యతో కలిసి పార్కులో ఉన్న కుందేళ్ళు, బాతులు, కోళ్ళు, ఇతర పక్షులతో సరదాగా గడిపారు. పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందంటూ కాలనీ అసోసియేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఖాసీం, ప్రతినిధులు ఆనంద్, నాయకులు అనిల్, రాజేందర్, కాశీనాధ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ప్రొ.సురజిత్‌ధారా

రాయదుర్గం: హెచ్‌సీయూ ప్రొఫెసర్ సురజిత్‌ధార బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్-2025 ఫెలోగా ఎన్నికయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లో ఆయన విధులను నిర్వహిస్తున్నారు.లిక్విడ్ క్రిస్టల్ సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి లిక్విడ్ క్రిస్టల్ పరికరాల సాంకేతికతను ఆయన అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

'మనూ'లో 23న వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో 23న వర్క్‌షాప్ జరుగుతుందని ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ బుధవారం తెలిపారు. ఆసక్తి కలవారు 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రముఖ కమ్యూనిటీ రేడియో నిపుణులు, హెచ్‌సీయూ ప్రొఫెసర్ వినోద్ పవరాల, ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, మన టివి మాజీ సీఈఓ డాక్టర్ రామారావు, కేంద్ర సమాచార శాఖ సీఆర్‌ఎస్ సెల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమిత్ ద్వివేది ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటారని వివరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

6.5 కేజీల ఎండు గంజాయి స్వాధీనం



నిందితుడు ఇంద్రకుమార్

మియాపూర్: జైలుకు వెళ్లినా తన ప్రవర్తన మార్చుకోకుండా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మెట్రోస్టేషన్ సమీపంలోని పిల్లర్ నంబర్- 603 వద్ద మంగళవారం రాత్రి మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు, మియాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా ఇంద్రాకుల గ్రామానికి చెందిన ఇంద్రకుమార్(27)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద ఎండు గంజాయిని గుర్తించారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా అతను అరకులో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడని తెలిసింది. సంక్రాంతి పండుగకు స్వంత గ్రామానికి వస్తూ అరకు నుండి గంజాయిని తీసుకు వచ్చి స్థానికంగా విక్రయించేందుకు పథకం పన్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువచ్చి ఎక్కువ ధరకు అమ్మడానికి నిర్ణయించుకున్నాడు. గతంలో అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 గంజాయి కేసులు నమోదై పట్టుబడి గత ఏడాదిలో జైలుకు వెళ్లి వచ్చాడు.బయటకు వచ్చాక గంజాయి విక్రయం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో అతను మియాపూర్ పోలీసులకు పట్టుబడగా 6.5 కేజీల ఎండు గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మియాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.



అవంతినగర్ తోటలో భోగి పండుగ సందర్భంగా చిన్నారికి భోగిపండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు



వి. రామారావు నగర్‌లో చిన్నారికి భోగిపండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు



వి. రామారావు నగర్‌లో ముగ్గు వేసి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న మహిళలు



మోతీనగర్‌లో కనుమ పండుగ సందర్భంగా గంగిరెద్దుకు పూజలు చేస్తున్న స్థానికుడు

సంక్రాంతి.. సంబురం

సంక్రాంతి పండుగ సందర్భంగా మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని పలు బస్తీ, కాలనీల్లో యువకులు పతంగులు ఎగురవేస్తూ సంబరాలు చేసుకున్నారు. మహిళలు అందమైన రంగవల్లులు వేస్తూ తమ ఆనందాన్ని తోటి మహిళలతో పంచుకున్నారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి తాత, అమ్మమ్మలు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మూడు రోజులు ప్రతి ఇంటి ముందుకు వచ్చిన గంగిరెద్దుల విన్యాసాలు చిన్నారులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా నారదుడి వేషధారణ, నృత్యాలు చూడ ముచ్చటగా కనువిందు చేశాయి. - మోతీనగర్



ముగ్గు వేస్తున్న వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి



శ్రీ వివేకానందనగర్‌లో భోగి మంటలు వేస్తున్న మస్తాన్ రెడ్డి తదితరులు

వాల్వ్ లీకేజీలు.. నీరు రోడ్డు పాలు

రహదారులు బురదమయం

ఆల్విన్‌కాలనీ: తాగునీటి లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. దీనికితోడు కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారిలోని పీజేఆర్ విగ్రహం వద్ద ఉన్న రెండు వాటర్ వాల్వ్ లీకేజీలతో కొన్ని రోజులుగా గ్యాలన్ల కొద్దీ నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికి పలుమార్లు వాల్వ్‌లను సరిచేసినా సమస్య పునరావృతమవుతోందని, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రధాన రహదారిలో పైప్‌లైన్ లీకవటంతో రోడ్డుపై వెళ్లే వాహనాల ధాటికి దుమ్ము, ధూళి చేరి రంగుమారిన నీరు సరఫరా అవుతుందని వాపోయారు. కాలనీలో రోడ్లు బురదమయం అవుతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని తాగునీటి లీకేజీలను అరికట్టడంతో బాటు మంచినీటిని సరఫరా చేయాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.





రిక్షాపుల్లర్స్ కాలనీ పీజేఆర్ విగ్రహం వద్ద..



ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మెయిన్ రోడ్డులో..